క్లుప్తంగా

విద్యుత్ లైన్ల కింద మంటలు పెట్టొద్దు

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ లైన్లు, హై టెన్షన్ల లైన్ల కింద మంటలు పెట్టవద్దని, వ్యర్థాలను దహనం చేయరాదని పవర్ గ్రిడ్ కార్పొరేషన్ డిప్యూటీ జనరల్ మేనేజర్ రాములు, సహాయ మేనేజర్ బరకతుల్లా గురువారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. జిల్లా నుంచి తమిళనాడు, కర్ణాటక, ఛత్తీస్‌ఘడ్‌ని కలుపుతూ దేశంలోని వివిధ ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. లైన్ల కింద మంటలు వేయడం వలన విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో పాటు ప్రమాదాలకు అవకాశం ఉంటుందని, అలాగే లైన్ల కింద పామాయిల్, కొబ్బరి మొక్కలు సాగు చేయరాదన్నారు.

మాతా-శిశు మరణాలకు అడ్డుకట్ట వేద్దాం

– డీఎంఅండ్‌హెచ్‌ఓ సుధారాణి

చిత్తూరు రూరల్(కాణిపాకం): మాతృ మరణాలు జరగకుండా చూడాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ సుధారాణి ఆదేశించారు. చిత్తూరులోని తన కార్యాలయంలో గురువారం శాఖ అధికారులతో డీఎంఅండ్‌హెచ్‌ఓ సమీక్షించారు. గర్భవతులను నమోదు చేయడం మొదలుకుని వారికి కాన్పులు అయ్యేవరకు మెరుగైన సేవలు అందివ్వాలన్నారు. మాతా-శిశుమరణాలకు అడ్డుకట్ట వేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఎండ తీవ్రత అధికంగా ఉందని, వడదెబ్బపై గ్రామాల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల నమోదును వంద శాతం పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకట ప్రసాద్, డీఐఓ హనుమంతరావు, డీఎంఓ వేణుగోపాల్, అధికారులు గిరి, ప్రవీణ, అనూష, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సినిమా థియేటర్ల తనిఖీ


థియేటర్లో పరిశీలిస్తున్న తహసీల్దార్

చిత్తూరు రూరల్ (కాణిపాకం): సినిమా థియేటర్ నిర్వాహకులు కచ్చితంగా నిబంధనలు పాటించాలని తహసీల్దార్ చంద్రశేఖర్ హెచ్చరించారు. చిత్తూరులోని పలు థియేటర్లను గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. తినుబండారాలను ఏ ధరలకు విక్రయిస్తున్నారో ఆరా తీశారు. నిర్ణీత ధరకే విక్రయించాలని, ధరల పట్టిక ఏర్పాటు చేయాలని ఆయన ఆదేశించారు.

రక్త హీనత నివారణకు తగు చర్యలు

యాదమరి: సరైన సమయంలో రక్తహీనతను గుర్తించి నివారణకు తగిన చర్యలు తీసుకుంటున్నామని గ్రామీణ ఆరోగ్య అధికారి లక్ష్మీనారాయణ చెప్పారు. గురువారం ఆయన సంతగేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద రక్తపరీక్షలకు అవసరమైన సికెల్ సెల్ అనీమియా కిట్లను ఆరోగ్య కార్యకర్తలకు అందజేసి మాట్లాడారు. పల్లె ప్రాంతాల్లోనే రక్తహీనత లోపాలు అధికంగా ఉన్నాయన్నారు. సరైనా పౌష్టికాహారం తీసుకోకపోవడం వల్ల లోప సమస్యలు వస్తున్నాయన్నారు. అలాంటి వారికి రక్త పరీక్షలు త్వరితగతిన పూర్తి చేసి ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేస్తామన్నారు. వీరి కోసం ప్రభుత్వం ప్రత్యేకమైన మందులు ఇస్తుందన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, మహిళా ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

బొమ్మసముద్రం పీహెచ్‌సీలో స్పిరో మెట్రీ పరీక్షలు


రోగులకు స్పిరోమెట్రీ పరీక్షలు చేస్తున్న దృశ్యం

గుడిపాల: బొమ్మసముద్రం పీహెచ్‌సీలో రోగులకు స్పిరో మెట్రీ (ఊపిరితిత్తుల పనితీరు) పరీక్షలను టీబీ అలర్ట్ ఇండియా స్టాఫ్ సోమశేఖర్ నిర్వహించారు. గురువారం టీబీ వ్యాధితో బాధపడుతున్న వారికి ఉబ్బసం, ఎంఫిసెమా, పల్మనరి ఫైబ్రోసిస్‌లతో పాటు శ్వాసకోశ వ్యాధులకు సంబంధించి చికిత్స కూడా చేశారు. దీంతో పాటు ఊపిరితిత్తులకు సంబంధించి రోగులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. డాక్టర్ రష్మిత, ల్యాబ్ టెక్నీషియన్ శశికళ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుడి మృతి

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ పారిశుద్ధ్య కార్మికుడు మోహన్ అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. ఇది తెలుసుకున్న కమిషనర్ నరసింహప్రసాద్, ప్రజారోగ్యశాఖ అధికారి లోకేష్ కలిసి మృతుడి ఇంటికి వెళ్లి నివాళులర్పించారు. అంత్యక్రియల నిమిత్తం కార్పొరేషన్ తరఫున రూ.15 వేలను అందచేశారు.

వివాదాల నడుమే గేటు రైటు..!

చిత్తూరు కూరగాయాల మార్కెట్ గేటు వసూళ్లకు సంబంధించిన టెండర్లు వివాదాల మధ్య ముగిసింది. అధికార పార్టీలోని ఇరు వర్గాలు వేలంలో పోటీపడగా, చివరకు ఎమ్మెల్యే వర్గం గేటును సొంతం చేసుకుంది. జంతువధశాల, బస్టాండు రుసుముల టెండర్లను కూడా కూటమి నేతలే దక్కించుకున్నారు.

- చిత్తూరు కార్పొరేషన్‌లో ముగిసిన మార్కెట్ టెండర్లు
- వేలం పాటలో ఎమ్మెల్యే.. చుడా చైర్ పర్సన్ వర్గం పోటీ
- చివరకు వేలం పాట దక్కించుకున్న ఎమ్మెల్యే వర్గం


మార్కెట్ వేలానికి హాజరైన గుత్తేదారులు


చిత్తూరు కూరగాయాల మార్కెట్

చిత్తూరు అర్బన్: చిత్తూరు ప్రధాన కూరగాయల మార్కెట్‌లో 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రుసుములు (గేటు) వసూలు చేసుకోవడానికి గురువారం కార్పొరేషన్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించారు. గత మూడేళ్లుగా జరిగిన వేలం పాటలోని సరాసరి మొత్తం రూ.53 లక్షలుగా పేర్కొంటూ, సర్కారీవారి పాటను ప్రారంభించారు. వేలంలో పాల్గొనేందుకు ఎంఆర్.మౌనికుమార్, శేషాద్రినాయుడు, శశికళ అనే ముగ్గురు అర్హులుగా ఉన్నారు. శశికళ తరపున చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత వర్గానికి చెందిన సతీష్ వేలంలో పాల్గొనేందుకు రాగా, ఓ న్యాయవాది వచ్చి ఇతనిపై క్రిమినల్ కేసు ఉండడంతో పాల్గొనే అవకాశం ఇవ్వరాదని ఆక్షేపణ పత్రం ఇచ్చారు. వేలం పాటకు శశికళను తీసుకొస్తానని సతీష్ చెప్పగా.. వేలం మరో రోజు నిర్వహిస్తామంటూ అధికారులు వాయిదా వేశారు. జంతు వధశాలకు టీడీపీ కార్యకర్త శేషాద్రినాయుడు రూ.1.95 లక్షలకు, బస్టాండులో ప్రైవేటు బస్సుల నుంచి పార్కింగ్ కోసం మరో టీడీపీ కార్యకర్త రాజశేఖర్ నాయుడు రూ.6.63 లక్షలకు టెండర్లు దక్కించుకున్నారు. ప్రధాన మార్కెట్‌ను మరోసారి వేలం వేస్తామని చెప్పిన అధికారులు ఉన్నఫలంగా మధ్యాహ్నం 3 గంటలకు వేలం నిర్వహించారు. ఇందులో మౌనికుమార్, శేషాద్రి నాయుడు పాల్గొనగా.. రూ.62.04 లక్షలకు మార్కెట్ గేటును ఎమ్మెల్యే అనుచరుడైన మౌనీకుమార్ దక్కించుకున్నాడు. ఇన్ని వివాదాల నడుమ మార్కెట్ గేటు టెండర్లను పూర్తి చేసినట్లు కార్పొరేషన్ అధికారులు ప్రకటించారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ ప్రసాద్, రెవెన్యూ అధికారులు గోపాలకృష్ణవర్మ, ఉమామహేశ్వర్‌రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

ఉచితం చేయొచ్చుగా..?

చిత్తూరు మార్కెట్ గేటు వసూలు చేయడమంటే.. జిల్లా నలుమూలలా పంటలు పండించుకునే రైతులు ఇక్కడి బజారులో విక్రయిస్తుంటారు. వీళ్లతో పాటు కొబ్బరికాయలు, పానీపూరి, వీధి విక్రయదారులు.. ఇలా చాలా మంది రోడ్లపై వ్యాపారాలు చేస్తుంటారు. వీళ్ల కార్పొరేషన్‌కు చెల్లించాల్సిన రూ.20కు బదులుగా టెండర్లు దక్కించుకునేవాళ్లు రూ.50, రూ.100, రూ.300, రూ.2 వేల వరకు వసూలుచేస్తూ బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్నారు. రైతులు, రోడ్లపై వ్యాపారాలు చేసుకుంటున్న నిరుపేదల రక్తాన్ని పీల్చేసే ఈ అక్రమాలకు అడ్డుకట్ట వేస్తూ గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో చిత్తూరు ఇన్‌చార్జ్ విజయానందరెడ్డి నాలుగేళ్లపాటు గేటు రుసుము కార్పొరేషన్‌కు చెల్లించి, ఏ ఒక్కరి నుంచి రూపాయి కూడా వసూలు చేయకుండా ఉచితం చేశారు.

ఈ దఫా అధికారంలో ఉన్న కూటమి నేతలు మార్కెట్ గేటును ఉచితం చేస్తే, ప్రజలకు చాలా మేలు చేసినట్లవుతుంది. అలా కాదని బలవంతపు వసూళ్లకు పాల్పడితే రైతుల కడుపు కొట్టడంతో పాటు నిత్యం గొడవలు, వివాదాల నడుమ చిత్తూరులో శాంతిభద్రతలకు సైతం విఘాతం కలిగే అవకాశాలున్నాయనే ఆందోళన వ్యక్తమవుతోంది.

నోటీస్ బోర్డు

30న ఉగాది వేడుకలు

కాణిపాకం: ఈ నెల 30న కాణిపాక శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించనున్నామని ఈఓ పెంచలకిషోర్ తెలిపారు. ఉదయం స్వామి వారికి ప్రత్యేక అభిషేకం, చందనాలంకారం, ఆ తర్వాత 9 నుంచి 11గంటల వరకు పంచాంగ శ్రవణం ఉంటుందన్నారు. వేడుకల నేపథ్యంలో ఆరోజున అర్జిత సేవలను రద్దు చేస్తున్నట్లు తెలియజేశారు.

23న ఉచిత వైద్య శిబిరం

చిత్తూరు కలెక్టరేట్ : సిద్ధ సమాధి యోగా ఆధ్వర్యంలో ఈ నెల 23న నగరంలోని కణ్ణన్ ప్రభుత్వ హైస్కూల్‌లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉచిత వైద్య శిబిరాన్ని శ్రీ వెంకటేశ్వర ఆయుర్వేదిక్ మెడికల్ కాలేజీ, ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్టు యోగాచార్యులు నరేంద్రకుమార్ తెలిపారు. శిబిరంలో డయాబెటీస్ స్పెషాలిటీ సహకారంతో మధుమేహ పరీక్షలు చేస్తారని, నగర ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 8247609140, 7013884371 సెల్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

నేడు పీవీకేఎన్‌లో 'వికసిత్ భారత్'

చిత్తూరు కలెక్టరేట్ : పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ కార్యక్రమం నిర్వహించనున్నారని ప్రిన్సిపల్ డా.జీవన జ్యోతి తెలిపారు. మేరా యువ భారత్ సంఘటన్, పీవీకేఎన్ ప్రభుత్వ కళాశాల సంయుక్తంగా ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. 18 నుంచి 25 ఏళ్లలోపు యువతకు వక్తృత్వ పోటీలను నిర్వహిస్తారన్నారు. దీనికిగాను చిత్తూరు, తిరుపతి జిల్లాల నుంచి 110 మంది యువతీ యువకులను ఎంపిక చేసినట్లు తెలిపారు. అనంతరం జిల్లా స్థాయిలో పది మందిని రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతామని, రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యే యువతను అసెంబ్లీలో స్పీకర్ సమక్షంలో మాట్లాడేందుకు అవకాశం కల్పిస్తారని చెప్పారు.

అర్ధగంటలోనే మోకాలి కీళ్ల మార్పిడి శస్త్రచికిత్స..!


మోకాలు కీళ్ల మార్పిడి శస్త్ర చికిత్స చేస్తున్న ఆర్థోపెడిక్ సీనియర్ సర్జన్ వైద్య బృందం

తవణంపల్లె: మండలంలోని అరగొండ అపోలో హాస్పిటల్లో బుధవారం రాత్రి అధునాతన యంత్రాలతో అతి తక్కువ సమయంతో ఆర్థోపెడిక్ సీనియర్ వైద్య నిపుణుల బృందం మోకాలికి శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. సాధారణంగా మోకాలికి గంటన్నరపాటు చేసే శస్త్ర చికిత్సను అధునాతన యంత్రాలతో, కేవలం అర్ధ గంటలోనే ఆర్థోపెడిక్ సీనియర్ సర్జన్ (మోకాలి కీళ్ల మార్పిడి వైద్య నిపుణులు) వైద్య బృందం డాక్టర్ విజయ్‌కిషోర్‌రెడ్డి, డాక్టర్ కునేల్ పాటిల్ నొప్పి లేకుండా విజయవంతంగా నిర్వహించారు. కార్యక్రమంలో అపోలో హాస్పిటల్ జనరల్ మేనేజర్ డాక్టర్ వినోద్‌కుమార్, మేనేజర్ చంద్రశేఖర రెడ్డి పాల్గొన్నారు.

అడవుల సంరక్షణపైనే మానవాళి మనుగడ


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అటవీ అధికారులు

గుడిపాల: అడవికి నిప్పుపెట్టడం నేరమని చిత్తూరు తూర్పురేంజ్ ఆఫీసర్ థామస్ అన్నారు. వన్యప్రాణి సంరక్షణ, అడవుల సంరక్షణపై గురువారం బొమ్మసముద్రంలో అటవీ అధికారులు కళాజాత నిర్వహించారు. అడవికి నిప్పు–మానవాళికి ముప్పు అని జానపద గీతాలు, ఇంద్రజాల ప్రదర్శనతో వారికి అవగాహన కల్పించారు. వన్యప్రాణులను వేటాడకూడదని, అడవుల సంరక్షణ అందరి బాధ్యత అని అన్నారు. పచ్చదనం పెంపుపైనే మానవాళి మనుగడ ఆధారపడి ఉందని, విచక్షణారహితంగా అడవులను నరికివేస్తే భావితరాలు భారీ మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. నవ్య ఫోక్ ఆర్ట్స్ ఆర్గనైజేషన్ కళాకారులు ప్రజలకు తమ కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు ప్రభాకర్‌రెడ్డి, మధు, గౌస్ బాషా, ఉష తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు యూనిఫాం పంపిణీ


యూనిఫాం పంపిణీ చేస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ

చిత్తూరు రూరల్(కాణిపాకం): ఆశావర్కర్లు విధులను సక్రమంగా నిర్వర్తించాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ సుధారాణి అన్నారు. చిత్తూరులోని తన కార్యాలయంలో గురువారం ఆమె ఆశా వర్కర్లకు యూనిఫాం పంపిణీ చేసి మాట్లాడారు. డ్యూటీ సమయంలో కచ్చితంగా యూనిఫాం ధరించాలన్నారు. విధుల్లో అలసత్వం వహించరాదని, లక్ష్యాల సాధనకు సమర్థవంతంగా పనిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఐఓ హనుమంతరావు, సిబ్బంది జయరాముడు, మూర్తి పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి పూజ


పూజలు చేస్తున్న వేద పండితులు

కాణిపాకం: కాణిపాక శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలోని శ్రీవీరాంజనేయస్వామి ఆలయ పునర్నిర్మాణానికి సంబంధించి గురువారం రాతి పనులకు ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. వేదపండితులు శాస్త్రోక్తంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సిబ్బంది కోదండపాణి, బాలాజీ నాయుడు, శివాంజనేయులు, అర్చకులు, పండితులు పాల్గొన్నారు.

వీఆర్‌వోల సమస్యలు పరిష్కరించరూ!

– కలెక్టర్‌కు గ్రామ రెవెన్యూ అధికారుల అసోసియేషన్ వినతి


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామ రెవెన్యూ అధికారుల అసోసియేషన్ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో విధులు నిర్వహిస్తున్న వీఆర్‌వోల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు రాజశేఖర్ వినతిపత్రం ఇచ్చారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. క్షేత్రస్థాయిలో గ్రామ రెవెన్యూ అధికారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించి పరిష్కరించాలన్నారు. క్లస్టర్ విధానంలో రెండు సచివాలయాలకు కలిగి ఒకే వీఆర్‌వోను మ్యాపింగ్ చేయడం అన్యాయమన్నారు. రెండు సచివాలయాల పరిధిలో ఒకే ఒక వీఆర్‌వో ఉంటే పనిభారం మరింత పెరుగుతుందన్నారు. వీఆర్‌వోలకు రెవెన్యూ శాఖకు సంబంధం లేని ఇతర శాఖల పనులను అప్పగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో ఖాళీగా ఉన్న సీనియర్ అసిస్టెంట్ పోస్టులను వన్‌టైం సెటిల్‌మెంట్‌లో ఉద్యోగోన్నతులు కల్పించాలని కోరారు. డీగ్రేడ్ చేసిన 54 సీనియర్ అసిస్టెంట్ పోస్టులను పునరుద్ధరించేందుకు ప్రభుత్వానికి నివేదికలు పంపాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శరత్‌కుమార్, ఉపాధ్యక్షులు వెంకటముని, ఇతర నాయకులు దామోదరం, ఉమామహేశ్వరి, కరుణాకరన్, తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనాలు సద్వినియోగం చేసుకోండి


రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారులు

బంగారుపాళెం: రైతులకు ప్రభుత్వం రాయితీపై ఇచ్చే విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని చిత్తూరు సహాయ వ్యవసాయ సంచాలకులు ఉమ కోరారు. గురువారం చీకూరుపల్లె రైతు సేవా కేంద్రం ఆవరణలో రైతులకు సమావేశం నిర్వహించారు. 2024లో రైతులకు పంపిణీ చేసిన ఉలవల విత్తన వినియోగం, దిగుబడి గురించి అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారుల వివరాలు, ఈ-పంటలో నమోదైన వివరాలను సేకరించారు.

ఆమె మాట్లాడుతూ, రాయితీపై పొందే విత్తనాలను రైతులు తప్పనిసరిగా తమ పొలాల్లో విత్తుకోవాలని, వ్యవసాయాధికారుల సూచనలు–సలహాలు పాటించి నాణ్యమైన దిగుబడి సాధించాలన్నారు. కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా ఏడీఏ మజీద్ అహ్మద్, ఏఓ కృష్ణవేణి, బంగారుపాళెం ఏఓ చిట్టిబాబు, ఏఈఓ సాదరయ్య, రైతు సేవా కేంద్రం సిబ్బంది ఎగువమూర్తి సాయిజా, రైతులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీఓ వాణిశ్రీ

యాదమరి: అంగన్‌వాడీలోని పిల్లల్లో విద్యా ప్రమాణాలు పెంపొందించడానికి అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్నామని, శిక్షణతో మంచి ఫలితాలు సాధించాలని సీడీపీఓ వాణిశ్రీ అన్నారు. మండలంలోని కె.గొల్లపల్లె ఉన్నత పాఠశాలలో గురువారం కార్యకర్తలకు మూడు రోజుల శిక్షణ తరగతులు ప్రారంభించి సీడీపీఓ మాట్లాడారు. పిల్లల్లో ఆటపాటలతో కూడిన విద్యాబోధనలో మెలకువలు నేర్పేలా శిక్షణ ఇవ్వనున్నట్టు చెప్పారు. తద్వారా పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యను అందించి కేంద్రాలకు వచ్చేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు లలిత, భాస్కర్ రెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు మమత, లలితమ్మ, సరళ కుమారి, కవిత తదితరులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాల పెంపే లక్ష్యం

బంగారుపాళెం: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల విద్యా ప్రమాణాలను పెంచడానికే పిబిపిబి(పోషణ్ బి పడాయిబి) కార్యక్రమమని బంగారుపాళెం సీడీపీఓ వాణిశ్రీదేవి అన్నారు. మండలంలోని మొగిలిమిట్టూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం అంగన్‌వాడీ కార్యకర్తలకు పిబిపిబి కార్యక్రమంపై మూడు రోజుల శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. శిక్షణా తరగతులను ప్రారంభించి సీడీపీఓ మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలందరూ విద్యలో సమగ్రాభివృద్ధి చెందడానికి కావలసిన ప్రేరణ కలిగించేందుకు పిబిపిబి శిక్షణ తరగతులు దోహదం చేస్తాయన్నారు. సూపర్‌వైజర్లు జయశ్రీ, రెడ్డికళ్యాణి బాల్య విద్య ప్రాముఖ్యత, ఎన్‌ఈపి 2020, నవచేతన, ఆదర్శశీల, నిపుల్‌భారత్ గురించి అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మొగిలి, చీకూరుపల్లె సెక్టార్‌కు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో 'ఫ్యామిలీ డాక్టర్'


గుడిపాల: వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ పవన్


తవణంపల్లె: ఏ.గొల్లపల్లెలో వృద్ధులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ వినయ్‌కుమార్

గుడిపాల: మండలంలోని తుమ్మిందపాళ్యంలో గురువారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. 104 వైద్యాధికారి పవన్ రోగులు, గర్భిణులు, బాలింతలకు రక్తపరీక్షలు చేసి మందులు అందజేశారు. వేసవిలో వడదెబ్బ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. అనంతరం మంచానికే పరిమితమైన రోగుల ఇళ్లకు వెళ్లి వారినీ పరీక్షించి సలహాలు–సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది రాధిక, రాజేశ్వరి, నందిని, వృషిత పాల్గొన్నారు. .

ఏ.గొల్లపల్లెలో..

తవణంపల్లె: మండలంలోని ఏ.గొల్లపల్లెలో తవణంపల్లె వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. గర్భవతులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, మధుమేహ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఎండాకాలంలో ఆరోగ్య సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యం రెడ్డి, ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉలవ పంట పరిశీలన


రైతులతో మాట్లాడుతున్న ఏడీఏలు

గుడిపాల: ప్రభుత్వం 80శాతం రాయితీపై పంపిణీ చేసిన ఉలవలను రైతులు సాగు చేశారా, లేదా? అని గురువారం చిత్తూరు వ్యవసాయశాఖ అగ్రికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్లు మజీద్ అహ్మద్, ఉమ పరిశీలించారు. పేయనపల్లె లో రైతులకు సమావేశం నిర్వహించారు. ఉలవలు సాగు చేస్తే దిగుబడి ఎంత వచ్చింది, ఎంత రేటు పలికింది, ఆదాయం ఎంత పొందారు? అనే విషయాలపై రైతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు మాధవి, క్రిష్ణవేణి పాల్గొన్నారు.

అభివృద్ధికి అందరూ సహకరించండి

- మార్కెట్ల వేలంలో అరగొండ మేజర్ పంచాయతీకి రూ.20.40లక్షల ఆదాయం
- డీఎల్‌పీఓ పార్వతి వెల్లడి


మార్కెట్ల వేలం నిర్వహిస్తున్న డీఎల్‌పీఓ పార్వతి

తవణంపల్లె: అరగొండ మేజర్ పంచాయతీ అభివృద్ధికి అందరూ సహకరించాలని డివిజనల్ పంచాయతీ అధికారి పార్వతి కోరారు. గురువారం మండలంలోని అరగొండ సచివాలయంలో సర్పంచ్ మల్లుదొరై అధ్యక్షతన వారపు సంత, దినసరి మార్కెట్, షాపింగ్ కాంప్లెక్స్ గదులకు వేలం పాటలు డీఎల్‌పీఓ, ఈఓపీఆర్ రాఘవేంద్రరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. డీఎల్‌పీఓ మాట్లాడుతూ, మార్కెట్ల వేలంలో వచ్చే ఆదాయాన్ని పంచాయతీ అభివృద్ధి పనులకు వినియోగించుకోవచ్చన్నారు. వేలంలో మొత్తం రూ. 20,40,750 ఆదాయం వచ్చిందన్నారు. వారపుసంతను రూ.7.95 లక్షలు, దినసరి మార్కెట్‌ను రూ.4.25 లక్షలకు ఎల్. వినాయకం కైవసం చేసుకున్నాడని, ఒకటవ రూముకు నెలకు రూ.14,700లు, 2వ రూము నెలకు రూ.11,400, 3వ రూము 15,100లు, 4వ రూము నెలకు రూ.9,300లకు, 5వ రూము నెలకు రూ.8300లు, 6వ రూము నెలకు రూ.9200 చొప్పున వేలం పాటదారులు కైవసం చేసుకున్నట్టు వివరించారు. కార్యక్రమంలో అరగొండ పంచాయతీ కార్యదర్శి మురుగేశన్, సచివాలయ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

జల చౌర్యానికి చెక్



యాదమరి: మండలంలోని బూమిరెడ్డిపల్లె పంచాయతీ జన్నావాళ్లమిట్ట దళితవాడలో తాగునీటి చౌర్యం జరుగుతోంది. డైరెక్ట్ బోరు నుంచి పైపును పొలాలకు తిప్పి ఆ నీటితో పంటలు సాగు చేస్తున్నారు. వాస్తవానికి నీటి ఎద్దడిని నివారణకు గత ప్రభుత్వ హయాంలో ఈ బోరు వేశారు. అయితే కొందరు ఈ బోరు నీటిని పొలాలకు మళ్లించి బోరు పంటలు సాగు చేస్తుండడంతో నీళ్ల కోసం ఇబ్బందులు తలెత్తాయి. దీంతో గ్రామస్తులు పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. దీనిపై ఆయన స్పందించి జల చౌర్యానికి చెక్ పెట్టారు.